# ప్రతిభకు పట్టం

- 'పది'లో ప్రతిభ చూపిన విద్యార్థులకు కార్పొరేట్ కళాశాలల్లో ఉచిత విద్య భోజనం, వసతి
- ఎస్సెస్సీలో 7.0 జీపీఏ నుంచి 10 జీపీఏ సాధించిన వారికి అవకాశం
- ఈ నెల 30 వరకు దరఖాస్తుకు అవకాశం

బొంరాస్‌పేట, మే 22 : పేద విద్యార్థులు చదువులో ప్రతిభ చూపిస్తున్నా.. ఆర్థిక పరిస్థితులు అనుకూలించక ఉన్నత చదువులకు దూరమవుతున్నారు. కొందరు మంచి మార్కులు సంపాదించినా కార్పొరేట్ కళాశాలల్లో చదవాలనే కోరిక నెరవేరడం లేదు. అలాంటి వారికి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్పొరేట్ కళాశాల విద్యా పథకం ఆశా దీపంగా నిలుస్తున్నది. పదో తరగతిలో ప్రతిభ చూపిన పేద విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ స్థాయిలో ఇంటర్మీడియట్ విద్యను ఉచితంగా అందించడానికి ఈ పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేస్తున్నది. ఈ పథకం కింద ఆయా కులాల రిజర్వేషన్ ఆధారంగా కేటాయించిన సీట్ల భర్తీకి ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది. మే 30వ తేదీ వరకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ పథకం ద్వారా జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగ విద్యార్థులకు కార్పొరేట్ కళాశాలల్లో ప్రవేశాలు కల్పిస్తారు. ఈ పథకం కింద ఒక్కో విద్యార్థికి ప్రభుత్వం రూ.35 వేలు ఫీజు కళాశాలలకు చెల్లిస్తుంది. విద్యార్థులకు ఏడాదికి అదనంగా ఖర్చుల కోసం రూ.3వేలు చెల్లిస్తుంది. దీంతోపాటు ప్రవేశం పొందిన కళాశాలలోనే ఉచిత విద్యతో పాటు భోజనం, వసతి కూడా కల్పిస్తారు.

**అర్హతలు**

దరఖాస్తు చేసుకునే విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.2 లక్షలకు మించకుండా ఉండాలి. విద్యార్హతలకు సంబంధించి ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన పదో తరగతి పరీక్షల్లో 7.0 జీపీఏ ఆపైన మార్కులు సాధించి ఉండాలి. సంక్షేమ వసతి గృహాలు, కేజీబీవీలు, ఆశ్రమ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు మొదటి ప్రాధాన్యం, ప్రభుత్వ పాఠశాలలు, ఎయిడెడ్ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు రెండో ప్రాధాన్యం, గురుకుల పాఠశాలలు, నవోదయ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు మూడో ప్రాధాన్యం, బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో చదివిన వారికి నాలుగో ప్రాధాన్యం కింద ప్రవేశాలు కల్పిస్తారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన అధికారులు కేటాయించిన సీట్లు
సాధించిన మార్కులు, రిజర్వేషన్, మెరిట్ ఆధారంగా విడుతల వారీగా కార్పొరేట్ కళాశాలల్లో ప్రవేశం కల్పిస్తారు.

**దరఖాస్తు విధానం-కావాల్సిన పత్రాలు**

విద్యార్థులు మే 30 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఈ పాస్ వెబ్‌సైట్‌లో కార్పొరేట్ అనే ఆప్షన్‌ను క్లిక్ చేసి అన్ని వివరాలను పూర్తి చేసి దరఖాస్తు చేయాలి. ఇందుకోసం విద్యార్థులు కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, 4 నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు, ఎస్సెస్సీ మెమో, ఆధార్ కార్డు, వసతి గృహాల్లో 8, 9, 10వ తరగతి చదివితే హాస్టల్ ధ్రువీకరణ పత్రం, రెండు ఫొటోలు, రేషన్ కార్డు జిరాక్సు ఇవ్వాల్సి ఉంటుంది.

**విద్యార్థులకు ఎంతో ఉపయోగం**

కార్పొరేట్ కళాశాల విద్యా పథకం పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగం. మంచి మార్కులు సాధించి ఆర్థిక పరిస్థితులు అనుకూలించని వారికి ప్రభుత్వం కార్పొరేట్ కళాశాలల్లో ఉచితంగా ప్రవేశం కల్పించి విద్య అందిస్తున్నది. ఎస్సెస్సీలో 7.0. నుంచి 10 జీపీఏ మార్కులు పొందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు మే 30లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు ప్రక్రియ ఈ నెల 15నుంచి ప్రారంభమైంది. విద్యార్థులు దీనిని సద్వినియోగం చేసుకోవాలి.

**-మల్లేశం, ఎస్సీ కులాల అభివృద్ధి అధికారి**

**హైదరాబాద్, మహబూబ్‌నగర్ కళాశాలల్లో ప్రవేశం**

జిల్లాలోని పదో తరగతి పూర్తి చేసిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు హైదరాబాద్‌లోని శ్రీ చైతన్య, నారాయణ, గాయత్రి, భాష్యం, ఎన్‌ఆర్ఐ తదితర కార్పొరేట్ కళాశాలల్లో, మహబూబ్‌నగర్‌లోని ప్రతిభ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో ప్రవేశం కల్పిస్తారు.

# 30లోపు పూర్తిచేయాలి

- పాఠశాలల్లో కొనసాగుతున్న పనుల్లో వేగం పెంచాలి
- వికారాబాద్ జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి
- అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో కొనసాగుతున్న మరమ్మతుల పరిశీలన
- మంబాపూర్ వరి కొనుగోలు కేంద్రం ఆకస్మిక తనిఖీ

మన్‌సాన్‌పల్లిలోని ప్రాథమిక పాఠశాలలో కొనసాగుతున్న మరమ్మతులను పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణ రెడ్డి

పెద్దేముల్, మే 22 : అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా ప్రభుత్వ బడుల్లో చేపట్టే పనులను ఈ నెల 30లోపు వేగవంతంగా పూర్తి చేయాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం మండల పరిధిలోని మన్‌సాన్‌పల్లి, మంబాపూర్‌లోని పాఠశాలల్లో కొనసాగుతున్న పనులు, మంబాపూర్‌లోని స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేస్తున్న ఏకరూప దుస్తులు, వరి కొనుగోలు కేంద్రాన్ని అధికారులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు వచ్చిన నిధులను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. కనీస వసతులైన నీటి సౌకర్యం, టాయిలెట్స్ మరమ్మతులు, విద్యుత్ తదితర పనులు చేపట్టాలన్నారు. పనులన్నీ నాణ్యతగా ఉండాలని సూచించారు. వర్షాలు కురిసే సమయాల్లో లీకేజీలు ఉంటే సరి చేసుకోవాలన్నారు. ఈ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వేగవంతంగా పూర్తయ్యేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అత్యవసరమైన పనులను గుర్తించి దగ్గరుండి వాటిని చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు.

**నాణ్యతా ప్రమాణాలు పాటించాలి**

మండల పరిధిలోని మంబాపూర్‌లో స్వయం సహాయక సంఘాల సభ్యులతో ఏకరూప దుస్తులు తయారు చేస్తున్న విధానాన్ని కలెక్టర్ పరిశీలించి తయారీ విధానాన్ని అడిగి తెలుసుకొన్నారు. విద్యార్థినీ, విద్యార్థులకు సంబంధిత పాఠశాలలో తీసుకున్న కొలతల ఆధారంగా ఆ దుస్తులను తయారు చేయాలని, పక్కాగా నాణ్యతా ప్రమాణాలను పాటించాలని సూచించారు. అంతకుముందు మహిళా సంఘాల ప్రతినిధులకు ఆయా పాఠశాలల విద్యార్థులకు సంబంధించిన సరైన కొలతలు ఇవ్వకపోవడంతో ఏపీఎం బాలయ్యపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

**రైతులకు ఇబ్బందులు కలుగకుండా..**

రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా వరి ధాన్యాన్ని సేకరించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంబాపూర్ శివారులోని వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పలు సూచనలు చేశారు. వరి ధాన్యంలో 17 శాతం తేమ ఉన్న ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు చేరవేయాలన్నారు. ఇప్పటికే 20 వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని సేకరించామన్నారు. 18 వేల మెట్రిక్ టన్నులకు సంబంధించి చెల్లింపులకు సిద్ధంగా ఉంచామన్నారు. రైతుల ఖాతాలో వెంటనే నగదును జమ చేస్తామన్నారు. ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించేందుకు వాహనాలను అందుబాటులో ఉంచామన్నారు. ఆయన వెంట జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రాజేశ్వర్, జిల్లా మేనేజర్ సుగుణాబాయి, డీఆర్‌డీవో శ్రీనివాస్, డీడబ్ల్యూవో, మండల ప్రత్యేక అధికారి జ్యోతి పద్మ, తహసీల్దార్ కిషన్, ఎంపీడీవో జర్నప్ప, ఎంఈవో వెంకటయ్య, ఆర్ఐ రాజు రెడ్డి, పీఆర్ ఏఈ సిద్ధార్థ, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు షఫీఫ్, రవీందర్, పంచాయతీ కార్యదర్శులు సంజీవ్ కుమార్, సుజిత్ కుమార్, ఏపీఎం బాలయ్య, సంబంధిత శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సాగులో విప్లవాత్మక మార్పు తీసుకురావాలి

- రైతుకు అందరం అండగా ఉండాలి
- అప్పుడే వ్యవసాయం లాభసాటిగా ఉంటుంది

సమావేశంలో మాట్లాడుతున్న నాబార్డ్ డిప్యూటీ మేనేజర్ దీప్తి సునీల్ తదితరులు

వ్యవసాయ యూనివర్సిటీ , మే 22 : సాగులో విప్లవాత్మక మార్పు తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలంగాణ నాబార్డ్ డిప్యూటీ మేనేజర్ దీప్తి సునీల్ అన్నారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ ప్రొ. జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని విస్తరణ విద్యాసంస్థలో నిర్వహించిన అమ్మకందారులు, కొనుగోలుదారుల సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రైతు లాభసాటి సాగుకు అందరూ మనవంతుగా సహకరించాలని సూచించారు. ఇతర పరిశ్రమలు అధిక ఉత్పత్తి చేసినప్పుడు బోనస్ లభిస్తుందని, వ్యవసాయ రంగంలో మాత్రం అధిక ఉత్పత్తి కారణంగా నష్టాలు భరించాల్సి రావడం దురదృష్టకరమని ఆమె అభిప్రాయపడ్డారు. త్వరగా పాడై పోయే టమాట, పూలు, కూరగాయలు , ఆకు కూరలు వంటి ఉత్పత్తుల మార్కెట్ జటిలమైన సమస్య అన్నారు. వ్యవసాయాన్ని సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా సిఫారసు చేసిన మేరకు పంట సాగు, మార్పిడి విధానాలను అవలంబించాలని సూచించారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా లాభ సాటి వ్యవసాయం చేయాలన్నారు. భూసార పరీక్షలు చేయించి.. మోతాదు ఎరువులు యాజమాన్యం చేపట్టాలని పేర్కొన్నారు. కొవిడ్ నుంచి అన్ని రకాల పరిశ్రమలు మూతపడినా వ్యవసాయ రంగం మాత్రం మంచి ఫలితాలు సాధించిందని గుర్తు చేశారు. సాగు అన్ని విధాల అభివృద్ధి కావాలని విస్తరణ సంస్థ సంచాలకులు డా.జగన్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. రైతులు తమ ఉత్పత్తులను శుభ్రం చేయడం, గ్రేడింగ్ చేయడం, ఎండబెట్టడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెడితే మంచి ధర వస్తుందన్నారు. వ్యవసాయ ఉత్పత్తులన్నీ ఆరు నెలల పాటు గిడ్డంగులలో నిల్వ చేసుకోవడానికి కూడా ఒక పథకం అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాలకు చెందిన రైతు ఉత్పత్తి దారుల సంఘాల రైతులు (ఎఫ్‌పీఓ)పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో పీజేటీఎస్‌ఏయూ డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డా.సీమ, విస్తరణ సంచాలకులు విసుధారాణి, ఐసీఏఆర్, విస్తరణ విద్యా సంస్థ సంచాలకులు నరేందరర్ రెడ్డి, డా.ఎంవీరెడ్డి, ఉపేంద్ర, చైతన్య , శైలజ పాల్గొన్నారు. మార్కెట్ ఇంటలిజెన్స్ విభాగం సయ్యద్ హుస్సేన్ , మురళి తదితరులు పాల్గొని పలు సూచనలు చేశారు.

# పంటల మార్పిడి.. అధిక రాబడి

- రోగకారక కీటకాల కట్టడికి ఈ విధానం ఎంతో మేలు
- ఒకే రకం పంటల సాగుతో తగ్గుతున్న భూసారం
- వ్యవసాయ అధికారుల ప్రత్యేక సూచనలు

ఇబ్రహీంపట్నంరూరల్, మే 22 : ప్రస్తుతం వర్షాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులు ఒకే రకం పంటల సాగుపై దృష్టి సారిస్తున్నారు. ఇలాగే పంటలను సాగు చేస్తే భూమిలోని సారం తగ్గిపోవడంతో పాటు క్రిమికీటకాలు ఇంకా వృద్ధి చెందే అవకాశ ముంది. రైతులు ఈ విధానానికి స్వస్తి చెప్పి పంటల మార్పిడి విధానాన్ని చేపట్టాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ఒకే రకం పంటలు సాగు చేస్తే భూసారం తగ్గడంతో పాటు రోగాలను కలిగించే పురుగుల సంఖ్య పెరిగి దిగుబడి తగ్గుతుంది. పంటల మార్పిడితో భూమిలోని పోషకాలు సంవృద్ధిగా అందుతాయి.

**ఒకే పంటను వరుసగా సాగు చేస్తే..**

- ఒకే పంటను ఒకే పొలంలో వరుసగా సాగు చేస్తే చీడపీడల ఉధృతి అధికంగా కావడానికి అనుకూల పరిస్థితులు ఏర్పడుతాయి.
- పురుగు జీవితచక్రం పూర్తి చేసుకుని తీవ్ర మైన హాని కలిగించే స్థితికి చేరుకుంటుంది.
- పంట మార్పిడి చేసినప్పుడు ఒక పంటపై ఆశించే పురుగులు మరో పంటపై ఆశించవు.
- వేగంగా వృద్ధి చెందే కొన్ని రకాల పురుగులను పంట మార్పిడితోఅదుపులో పెట్టవచ్చు.
- ఒకే లోతు వ్యవస్థ కలిగిన పత్తి, మిరప తదితర పంటలను మార్పిడి చేయకుండా సాగు చేస్తే ఒకే లోతు పొరల నుంచి పోషకాలు తీసుకోవడంతో నేల నిస్సారమవుతుంది.
- వరి, వేరుశనగ, జొన్న, మొక్కజొన్న తదితర పైర్లు నేలపై పొరల నుంచి పోషకాలను తీసుకుంటాయి.
- నేల భౌతిక లక్షణాలు, స్వభావం దెబ్బతినకుండా ఉండేందుకు, చీడపీడల అభివృద్ధిని నిరోధించడానికి పంట మార్పిడి తప్పక చేయాలి.
- అప్పుడప్పుడు అవసరాల మేరకు పశుగ్రాసం కోసం గడ్డిజాతిపైర్లు, భూసారాన్ని పెంచడానికి పచ్చిరొట్ట పైర్లు వేసుకోవాలి.

**పంటలు సాగుచేయాల్సిన విధానం..**

- వరి తర్వాత మినుము, పెసర, శనగ వేస్తే సుడిదోమ, టుంగ్రో వైరస్‌ను నివారించవచ్చు.
- చెరుకు తర్వాత వరి వేస్తే వేరు పురుగును తగ్గించొచ్చు. అలాగే వరిలో దోమపోటు నివారించవచ్చు.
- పత్తివేసిన పొలంలో జొన్న, మొక్కజొన్న, నువ్వులు, మినుములు వేస్తే లద్దె పురుగు, పచ్చ పురుగులను నివారించవచ్చు.
- జొన్న, మొక్కజొన్న తర్వాత కందిని సాగు చేస్తే కాయ తొలుచు పురుగు ఉధృత్తి తగ్గుతుంది.
- వరిని సాగుచేసే పొలంలో ముందుగా పప్పు ధాన్యాలను సాగు చేస్తే నేల సారవంతమవుతుంది.
- వేరుశనగలో ఆకుముడతను నివారించేందుకు పప్పుజాతికి చెందిన పైర్లు వేయాలి.
- కంది, మిరప పంటల్లో ఎండు తెగులు నివారణకు జొన్న, మొక్కజొన్న పంటలు సాగుచేయాలి.
- నులి పురుగు సమస్య అధికంగా ఉన్న ప్రాంతాల్లో వేరుశనగ, మిరప, పొగాకు, వంగపైర్ల సాగును కొన్ని పంట కాలాల వరకు ఆపాలి.
- ఆహార పంటలైన వరి, జొన్న, మొక్కజొన్న, సజ్జ పంటలను పప్పుజాతి పంటలైన పెసర, మినుము, వేరుశనగ సాగుతో మార్పిడి చేయాలి.
- ఆహార వాణిజ్య పంటలను పశుగ్రాస పైర్లతో మరోసారి మార్పిడి చేస్తే లాభదాయకం.

**పంటమార్పిడితో తెగుళ్లకు అడ్డుకట్ట**

రైతులు ఒకే రకమైన పంటలు సాగు చేయడం ద్వారా ఆ మొక్కలకు అవసరమైన పోషకాలు లభించవు. రోగకారక పురుగుల ఉధృతి పెరిగి దిగుబడి తగ్గుతుంది. వరుసగా ఒకే పంటను కాకుండా వివిధ రకాల పంటల సాగుతో పురుగుల జీవిత చక్రాన్ని నిలిపి వేయవచ్చు. దీంతో రైతులు మంచి లాభాలను ఆర్జిస్తారు. రైతులు ఒకేరకమైన పంటల సాగుకు పూర్తిగా స్వస్తి చెప్పి పంటల మార్పిడి విధానానికి శ్రీకారం చుడితే మంచి లాభాలు గడించే వీలుంది.

**- శ్రవణ్‌కుమార్, ఏఈవో, ఇబ్రహీంపట్నం**

## జింబాబ్వేలో వరల్డ్ తెలుగు ఐటీ కౌన్సిల్ సమావేశాలు

భారతదేశంలోని జింబాబ్వే రాయబారి డా.గాడ్‌ప్రే మజోని చిపారేతో సమావేశమైన ప్రపంచ తెలుగు ఐటీ కౌన్సిల్ చైర్మన్ సందీప్ మక్తల తదితరులు

సిటీబ్యూరో, మే 22 (నమస్తే తెలంగాణ): ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు ఐటీ నిపుణుల సంఘం వివిధ దేశాల్లో వ్యాపార సంబంధాలను పెంచుకోవడానికి ప్రయత్నిస్తుందని ప్రపంచ తెలుగు ఐటీ కౌన్సిల్ చైర్మన్ సందీప్ మక్తల తెలిపారు. సంస్థ కార్యకలాపాల విస్తరణలో భాగంగా బుధవారం భారతదేశంలోని జింబాబ్వే రాయబారి డా.గాడ్‌ప్రే మజోని చిపారే, చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ ఆఫీసర్ సిలిబాజిసో చిజ్వినా నేతృత్వంలోని జింబాబ్వే ఇన్వెస్ట్‌మెంట్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డబ్ల్యూటీఐటీసీ చైర్మన్ సందీప్ కుమార్ మక్తల మాట్లాడుతూ.. భారతదేశం, జింబాబ్వే దేశాల మధ్య వివిధ వ్యాపార కార్యకలాపాల మార్పిడిపై ప్రధానంగా చర్చించామన్నారు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలపై ప్రత్యేకంగా జింబాబ్వే ప్రతినిధులు దృష్టి సారించాని, అగ్రిటెక్, డ్రోన్, వ్యవసాయ రంగంలో ఏఐ వినియోగం వంటి అంశాల్లో వారు ఆసక్తిని కనబర్చారని చెప్పారు. వైద్యారోగ్య రంగంలోనూ ఉన్న అవకాశాలపై సమావేశంలో చర్చించామని తెలిపారు.

## ఓయూ ఇన్‌చార్జి వీసీగా దానకిశోర్

ఉస్మానియా యూనివర్సిటీ, మే 22: ఉస్మానియా యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీగా సీనియర్ ఐఏఎస్ అధికారి, రాష్ట్ర పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్ బాధ్యతలు స్వీకరించారు. ఓయూ పరిపాలనా భవనానికి వచ్చిన ఆయనకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ స్వాగతం పలికారు. వీసీ చాంబర్‌లో మాజీ వీసీ ప్రొఫెసర్ రవీందర్ నుంచి ఆయన బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనకున్న పరిధి మేరకు ఓయూలోని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఆయనను వివిధ ఫ్యాకల్టీల డీన్లు, పలు కళాశాలల ప్రిన్సిపాల్స్, డైరెక్టర్లు, ఇతర అధికారులు కలిశారు. అనంతరం వివిధ విద్యార్థి సంఘాలు వేర్వేరుగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలిపి..వర్సిటీ సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు.

## బాధ్యతల స్వీకరణ

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీగా ఐఏఎస్ అధికారి శైలజా రామయ్యర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

**- తెలుగు యూనివర్సిటీ**

# తెల్లాపూర్ రియల్ మార్కెట్‌లో మెరుగైన వృద్ధి రేటు

**- ఐదేండ్లలో 37 శాతం వృద్ధి చెందిందని అనరాక్ నివేదిక వెల్లడి**

సిటీబ్యూరో, మే 22 (నమస్తే తెలంగాణ): తెల్లాపూర్ రియల్ మార్కెట్‌లో మెరుగైన వృద్ధి రేటు కనబరుస్తోందని, గత ఐదేండ్లలో 37 శాతం వృద్ధి చెందిందని ప్రముఖ రియల్ ఎస్టేట్ మార్కెట్ అధ్యయన సంస్థ అనరాక్ బుధవారం విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. హైదరాబాద్ మహానగరంలో అత్యంత కీలకమైన ఐటీ కారిడార్‌కు సమీపంలోనే ఉండటంతో తెల్లపూర్ ప్రాంతంలో ఐటీ ఉద్యోగులు తమ నివాసాలకు అనుకూలంగా ఎంచుకొని అక్కడే అపార్టుమెంట్లలో ప్లాట్లు, గేటెడ్ కమ్యూనిటీల్లో విల్లాలు, బడ్జెట్ ధరల్లో ఇళ్లను కొనుగోలు చేస్తున్నారు. దీంతో గత ఐదేండ్లలో 37 శాతం వృద్ధి రేటు నమోదైందని పేర్కొంది. నగర శివారు ప్రాంతాల్లో పెట్టుబడులకు ఎంతో ఆకర్షణీయమైన ప్రాంతంగా ఉందని, మెరుగైన మౌలికవసతులు ఉండటంతో నివాస గృహాల అమ్మకాల మార్కెట్ బాగుంది. 1బీహెచ్‌కె, 2బీహెచ్‌కె, 3 బీహెచ్‌కె ఫ్లాట్ ధరలు రూ.40లక్షల నుంచి రూ.1.7 కోట్ల వరకు ఉందని, అద్దెలు సైతం ఆశించిన స్థాయిలో వస్తుండటంతో ఈ ప్రాంతంలోనే స్థిరాస్తులు కొనుగోలు పెరుగుదలనే సూచిస్తోందని అనరాక్ నివేదికలో పేర్కొంది.

## కిర్గిస్తాన్ విద్యార్థులకు అండగా ఉంటాం

అంబర్‌పేట, మే 22 : కిర్గిస్తాన్ విద్యార్థులకు అండగా ఉంటామని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. అక్కడ చోటు చేసుకున్న ఘటనలపై జీపీకే ఎడ్యుటెక్ డైరెక్టర్ విద్యకు మార్ బృందం బుధవారం కిషన్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్కడ భారతీయ విద్యార్థులు క్షేమంగా ఉన్నారని, వారిని భారతదేశానికి తిరిగి తీసుకొచ్చేందుకు అన్ని విధాలుగా ప్రయత్నిస్తున్నామన్నారు. కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రి జైశంకర్, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాతో మాట్లాడుతున్నానని చెప్పారు. త్వరలోనే స్వదేశానికి వస్తారని జీపీకే బృందానికి తెలిపారు. కిర్గిస్తాన్‌లో సాధారణ పరిస్థితులు నెలకొన్నాయని, సోషల్ మీడియాలో వస్తున్న వదంతులను నమ్మొద్దని జీపీకే డైరెక్టర్ తెలిపారు. సలహాలకు భారత ప్రభుత్వం, భారత రాయబార కార్యాలయం హెల్ప్‌లైన్ నంబర్-0555710041లో సంప్రదించాలని కోరారు.

## కులగణన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

కాచిగూడ, మే 22: కులగణన చేపట్టి, బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతే తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రిజర్వేషన్లు లేకుండా ఎన్నికలు నిర్వహిస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు. బుధవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 50 శాతం వరకు పెంచాలని, కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో స్థానిక సంస్థల రిజర్వేషన్లను 20 నుంచి 42 శాతం వరకు పెంచుతామని రాహుల్‌గాంధీ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సురేశ్, నందగోపాల్, పండరీనాథ్, ఉదయ్ నేత, జయంతిగౌడ్ పాల్గొన్నారు.

న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి అరుణకుమారి, న్యాయవాదులు

## పేదలకు ఉచిత న్యాయ సేవలందించాలి

- కార్యదర్శి అరుణకుమారి పిలుపు

నాంపల్లి కోర్టులు, మే 22 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ ప్రాంతంలోని నిరుపేదలకు ఉచితంగా న్యాయ సేవలందించాలని నాంపల్లి కోర్టుల న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి అరుణకుమారి పిలుపునిచ్చారు. నాంపల్లి కోర్టులోని ప్రధానహాలులో బుధవారం ఏర్పాటు చేసిన పారా లీగల్ వలంటీర్లు, పానల్ న్యాయవాదుల సమీక్షా సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పేదలకు ఉచిత న్యాయ సేవలందించేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలన్నారు. న్యాయపరమైన సమస్యలకు పరిష్కారం అందించేందుకు సహకారం అందించాలని, చట్టాల పై వారికి అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ పథకాలు పొందే పేదలకు సహాయం చేయాలన్నారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో వలంటీర్లు, న్యాయవాదులు, న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రముఖ జర్నల్‌లో ఐఐసీటీ సైంటిస్ట్ పరిశోధన గ్రంథం

సిటీబ్యూరో, మే 22(నమస్తే తెలంగాణ) : ప్రముఖ కెమికల్ జర్నల్ జేఎంసీలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీకి చెందిన సైంటిస్ట్ డా.ఉజ్వల్ పాల్ చేసిన పరిశోధన గ్రంథాన్ని ప్రచురించింది. ఆక్సిజన్ ఎవల్యూషన్ ప్రతీకార చర్యలపై అధ్యయనం చేసిన బృందం జరిగే రసాయనిక చర్యలను విశ్లేషించింది. ఈ మేరకు ప్రముఖ జర్నల్ జేఎంసీ-ఏ ఈ పరిశోధన గ్రంథాన్ని ప్రచురించగా.. డా.ఉజ్వల్ పాల్ పరిశోధనలపై పలువురు ఐఐసీటీ శాస్త్రవేత్తలు అభినందనలు తెలిపారు.

## స్పేస్ క్యూబ్డ్‌తో టీ హబ్ ఒప్పందం

సిటీబ్యూరో, మే 22 (నమస్తే తెలంగాణ): ఆస్ట్రేలియాలో స్టార్టప్‌లకు అవకాశాలను కల్పించేందుకు టీ హబ్ చర్యలు చేపట్టింది. ఆ దేశంలో ఉన్న ప్రముఖ నెట్‌వర్క్ కేంద్రమైన స్పేస్ క్యూబ్డ్‌తో ఇటీవల టీ హబ్ సీఐఓ సుజీత్ ఒప్పందం కుదుర్చుకొని పరస్పరం సంతకాలు చేశారు. తెలంగాణలోనే కాకుండా దేశ వ్యాప్తంగా ఉన్న ఔత్సాహికుల స్టార్టప్‌లను ప్రోత్సహిస్తున్న టీ హబ్, ఇతర దేశాల్లోనూ వాటికి వ్యాపార అవకాశాలు కల్పించేందుకు ఈ ఒప్పందం దోహదం చేస్తుందని టీహబ్ సీఐఓ తెలిపారు.

## ఎంబీఏ కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, మే 22: ఓయూ పరిధిలోని ఎంబీఏ కోర్సుల పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ (ఈవినింగ్) ఆరో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షా ఫీజును ఈ నెల 30లోపు సంబంధిత కళాశాలల్లో చెల్లించాలి. రూ.300 అపరాధ రుసుముతో వచ్చే నెల 6 వరకు చెల్లించవచ్చు. రెగ్యులర్ ఎంబీఏ నాలుగో సెమిస్టర్ , అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షా ఫీజును వచ్చే నెల 6 లోపు చెల్లించాలని, ర